క్లుప్తంగా

పిచ్చికుక్క నుంచి కాపాడండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్, కో ఆప్షన్ సభ్యుడు

పెద్దాపురం (సామర్లకోట): పిచ్చి కుక్క నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు. పట్టణ పరిధిలో ఇటీవల కాలంలో పిల్లలతో ఉన్న పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తోందని మున్సిపల్ కౌన్సిలర్ ఆర్లె రాఘవ (వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి) మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ ఆవేదన చేశారు. ఈ మేరకు ఆ నెలలో 10 మందిని కరిచిందని వారు తెలిపారు. పిచ్చికుక్క సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై అనేక పర్యాయాలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి స్పందనా లేదని వారు ఆరోపించారు. వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని వారు హెచ్చరించారు.

కాఠిన్యం వెనుక కారుణ్యం..

- నిరుపేద కుటుంబానికి ఎస్సై బాసట



నిరుపేద కుటుంబానికి కిరాణా సరకులు అందజేస్తున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం (సామర్లకోట): ఆకలితో అలమటిస్తున్న ఒక నిరుపేద కుటుంబానికి ఎస్సై మౌనిక కిరణా సరకులు అందజేసి అండగా నిలిచారు. స్థానిక కుమ్మరి వీధిలో నివసిస్తున్న కుటుంబంలోని వృద్ధులకు ఎటువంటి ఆధారం లేక దీనస్థితిలో ఉండటం, ఆకలితో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆమె గమనించారు. తనకు తోచిన రీతిలో కిరణా సామగ్రి అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. వారు నివసిస్తున్న పూరిల్లు శిథిలావస్థలో ఉండడంతో దాని నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. అత్యవసరం ఎమైనా ఉంటే తనను సంప్రదించాలని ఆమె నిరుపేద కుటుంబానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడిగా స్వయంభారపు



సామర్లకోట: నాయీ బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడిగా స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ స్వయభారపు వీరభద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెలలో జిల్లా అధ్యక్షుడిగా మెలిపాక నాగ సత్య నారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పిఠాపురం సూర్య గ్రంథాలయ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకారంలో తనను గౌరవ అధ్యక్షుడిగా రెండవ పర్యాయం ఎన్నుకున్నారని వీరభద్రరావు స్థానిక విలేకర్లకు తెలిపారు. మిగిలిన కమిటీ సభ్యుల నియామకం త్వరలో ఉంటుందన్నారు.

హుండీల ఆదాయం రూ.19.96 లక్షలు



పంచారామ క్షేత్రంలో హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో 199 రోజులకు హుండీల లెక్కింపు ద్వారా రూ.19,96,390 ఆదాయం వచ్చినట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. శుక్రవారం ఆలయంలో హుండీలను లెక్కించారు. కార్తిక మాసంలో ప్రత్యేకంగా హుండీల ఆదాయం తెలుసుకోవడానికి ముందుగా హుండీల లెక్కింపు జరిగింది. ఈ ఏడాది మార్చి 21 నుంచి అక్టోబరు 9 వరకు హుండీల లెక్కింపు దేవదాయశాఖ తనిఖీదారు ఫణికుమార్ పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే జగదీష్‌మోహనరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవస్థాన సిబ్బంది, అర్చకులు, ఉండూరు లక్ష్మీ నారాయణ సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొని హుండీలను లెక్కించారు.

లారీ స్టాండ్‌లో భారీ అన్నదానం

సామర్లకోట: స్థానిక లారీ స్టాండ్‌లో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. లారీ స్టాండ్‌లో నిర్వహించిన గణపతి నవ రాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్నదానం ఏర్పాటు చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బిసీడి దుర్గాప్రసాద్, కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి బుజ్జి పర్యవేక్షణలో సంఘ సభ్యులు, లారీ వర్కర్సు యూనియన్ సభ్యులు భక్తులకు సేవలందించారు. సుమారు 8 వేల మందికి అన్నదానం చేసినట్టు యూనియన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

పేద విద్యార్థులను మోసం చేయొద్దు

- పూర్తైన వైద్య కళాశాలలను చూడండి
- ప్రజల ఆస్తులు వారికే చెందాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో పేద విద్యార్థులకు వైద్య విద్య ఉచితంగా అందించాలనే లక్ష్యంతో 17 కళాశాలకు అనుమతి తీసుకువస్తే వాటిని ప్రైవేటు పరం చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక జీఓ తీసుకు వచ్చిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల సమస్యను ప్రజల వద్దకు తీసుకువెళ్లడానికి రచ్చ బండ నిర్వహించడం జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. జగన్ తీసుకువచ్చిన 17 కళాశాలల్లో ఐదింటిని ప్రారంభించారని, దీనికి సంబంధించి ఫోటోలతో కూడిన పుస్తకాన్ని ఆయన విలేకరులకు అందజేశారు. మిగిలిన కళాశాలలు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రత్యేక జీఓ ద్వారా నిర్మాణాలను నిలిపివేశారని ఆరోపించారు. పీపీపీ విధానంలో కూటమి నేతల వాటిని అప్పగించడానికి లోకేష్, చంద్రబాబునాయుడుల బినామిలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తి నర్సీపట్నంలో మెడికల్ కళాశాలలు లేవని సవాల్ చేయడంతో జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం వెళ్లారని తెలిపారు. ఈ పర్యటనకు అనేక ఆంక్షలు పెట్టినా వేలాది అభిమానులు తరలి వచ్చారని గుర్తు చేశారు. అబద్ధాలతో అధికారంలోనికి వచ్చిన నాయకులు ఇంకా వాటితోనే ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వ కళాశాలలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. వీటి నిర్మాణానికి కేవలం రూ.ఐదు వేల కోట్లు మాత్రమేనని అవుతాయని, ఈ



ఇంటింటా సంతకాలు సేకరిస్తున్న దొరబాబు

రోజు కూడా రూ.11వేల 200 కోట్లు అప్పు చేశారన్నారు. ఇప్పటి వరకు రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. నవంబరు 22 వరకు ప్రతి గ్రామంలో రచ్చబండ నిర్వహించి కోటి సంతకాల సేకరణలో భాగంగా నియోజవర్గం నుంచి 50 వేల సంతకాలు సేకరించి వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. ఈ నెల 28న నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. నవంబరు 12న కాకినాడ ఏడు నియోజకవర్గాల నాయకులు, మేధావులు, వివిధ పార్టీ నాయకలతో ర్యాలీ ఉంటుందన్నారు. నవంబరు 22న సేకరించిన సంతకాలను గవర్నర్‌కు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పెద్దాపురం పార్టీ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, జిల్లా అధికార పార్టీ ప్రతినిధి విష్ణు, నియోజకవర్గ జెడ్పీ విభాగం అధ్యక్షుడు నాగన బోయిన రాజబాబు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ జానీ, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నల్లల గోవిందు, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి

సీఐ శ్రీనివాస్



దుకాణ దారులకు సూచనలు ఇస్తున్న పోలీసులు

పిఠాపురం: తాత్కాలికంగా మందుగుండు సామగ్రి విక్రయానికి అనుమతులు పొందిన దుకాణదారులు నిబంధనలు పాటించి ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం టౌన్ పోలీసు స్టేషన్లో మందుగుండు దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దుకాణాల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలు, జాగ్రత్తలను వివరించారు. లైసెన్స్ షరతులను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా చర్యలు పాటించకపోవడం వలన ఎటువంటి ప్రమాదాలు సంభవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేటా చీపురూ లేకుండా పనులెలా?



పిఠాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పిఠాపురం: పనిముట్లు లేకుండా పనులెలా చేయాలంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం నిరసన నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏఐటీయూసీ నాయకుడు సాకా రామకృష్ణ మాట్లాడుతూ సాక్షాత్తు ఏపీ డిప్యూటీ సీఎం ఉన్న నియోజకవర్గం మున్సిపాలిటీలో సిబ్బంది, పనిముట్ల కొరతను గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఎనిమిది గంటల విధానాన్ని పది గంటలకు పెంచే ప్రతిపాదన తేవడం సరికాదన్నారు. తక్షణమే సిబ్బంది పెంచి పనిముట్ల కొరత లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండారు కన్నయ్య, చెక్క అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

- నవోదయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పెద్దాపురం (సామర్లకోట): విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని పెద్దాపరం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అన్నారు. నవోదయ విద్యాలయంలో ఈ నెల 4 నుంచి నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. విద్యాలయ కౌన్సిలర్లు నగేష్, కృష్ణవేణి మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ మానసిక సమస్యలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, స్పాట్ డిబేట్, ఉద్వేగాల ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ స్టాఫ్ నర్స్ బాయమ్మ, అధ్యాపకులు ధనలక్ష్మి, చక్రవర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కయాకింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



కయాకింగ్ శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

బాలాజీచెరువు: కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ పరిధిలోని వివిధ యూనిట్లకు చెందిన 70 మంది స్వచ్ఛంద క్యాడెట్ల కోసం 5 రోజుల పాటు నిర్వహించే కయాకింగ్ శిక్షణ శిబిరం స్థానిక పోర్టులో శుక్రవారం ప్రారంభమైంది. కమాండర్ అజయ్ యాదవ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి రిమ్స్ కళాశాల సహకరిస్తోంది. ఈ శిబిరం ద్వారా కేడెట్లకు కయాకింగ్ నైపుణ్యాలు, నీటిలో భద్రతపై శిక్షణ అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. శిబిరంలో కయాకింగ్‌కు సంబంధించిన సిద్ధాంతం ప్రామాణిక అంశాలు, భద్రతా నియమాలు, పడవ నడిపే పద్ధతులు, ప్రాథమిక నేవిగేషన్, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణరక్షణ సాంకేతికతలు మరియు ప్రథమ చికిత్స వంటి అంశాలను బోధించనున్నారు. అలాగే యువ ఆపద మిత్ర స్కీమ్ (వైఏఎమ్ఎస్)లో స్వచ్ఛందంగా పాల్గొనే క్యాడెట్లకు విపత్తు నిర్వహణకు సంబంధించిన ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నారు.

కుక్కుటేశుని దర్శిద్దామా..

- కార్తిక మాసోత్సవాలకు పాదగయ సిద్ధం
- ప్రత్యేక పూజలకు అధికారుల ఏర్పాట్లు
- నిత్యం లక్షపత్రి పూజలు, అభిషేకాలు



పిఠాపురం: పవిత్ర కార్తిక మాసోత్సవాలకు స్థానిక స్థానిక కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పాదగయ క్షేత్రంలోని ఈ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువ ఉండే దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లతో పాటు అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి కార్తికమాసం ప్రారంభం కానుండగా వేలాది మంది భక్తులు పుణ్య స్నానాల కోసం పాదగయకు తరలి వచ్చే అవకాశం ఉండడంతో పుష్కరిణిలో పాత నీటిని ఇప్పటికే తొలగించగా కొత్త నీటిని నింపే పనులను ప్రారంభించారు. కార్తిక దీపాలను వదిలేందుకు, దీపారాధనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక పూజల నిర్వహణకు ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. కార్తికంలో నిత్యం స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పలువురు భక్తులు శివ దీక్షలు స్వీకరిస్తున్నారు.

దూర ప్రాంత భక్తులకు ఆన్‌లైన్‌లో పూజలు

దూరప్రాంత భక్తులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ పూజలకు టిక్కెట్లు తీసుకున్న వారి పేరున వారు కోరుకున్న రోజున పూజలు నిర్వహించి ప్రసాదాలను పోస్టు ద్వారా పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలకు ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా సోమవారాల వంటి ప్రత్యేక దినాల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందరికీ స్వామి వారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది సుమారు 2 లక్షల మంది స్వామివారిని దర్శించుకోగా ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనాలు వేసి, దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శన వేళలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్,
ఈఓ పాదగయ క్షేత్రం, పిఠాపురం

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం



ఉపవాస ప్రార్థనలలో మాట్లాడుతున్న పాల్ ప్రసాద్

పెద్దాపురం (సామర్లకోట): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరమని దైవజనుడు పాల్ ప్రసాద్ అన్నారు. మండలం దివిలి గ్రామంలోని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ప్రపంచ శాంతికై రెండు రోజుల పాటు నిర్వహించిన ఉపవాస ప్రార్థనల ముగింపులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం నిర్వాహకుడు సంగిన సత్యానందం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దైవ జనుడు శామ్యూల్ సుదీప్, ఎన్.సలీషా, కె జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ లక్ష్యం ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలని ఎంఈఓలు వై.శివరామకృష్ణ, పి.పుల్లయ్య అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఏటా అక్టోబరు 11న బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నామని, బాలికలను రక్షిద్దాం.. వారిని చదివిద్దాం అని ప్రతి ఒక్కరూ ప్రతిన పూనాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ జి. ఉష మాట్లాడుతూ బాలికగా నాతోనే మార్పు–రండి ముందుకు అనే అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు బాల్య వివాహాల నుంచి ఏ విధంగా రక్షణ పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, నళిని, బీబీ, నిర్మల, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ అచ్చిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల్ని ఎత్తుకెళ్లడం అబద్ధం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో ఓ వ్యక్తి గురువారం అర్ధరాత్రి పిల్లల్ని ఎత్తుకెళ్లాడని జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని ఆసుపత్రి అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా వేదికగా అత్యుత్సాహంలో తప్పుడు పోస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళానికి గురిచేయవద్దని కోరారు. ఓ మానసిక రోగి పిల్లల వార్డు వద్ద సంచరించి కొందరితో వాదన పెట్టుకున్నాడని ఆ విషయాన్ని పిల్లల కిడ్నాప్‌గా చిత్రీకరించి తప్పుడు ప్రచారాలు చేశారని అన్నారు.

తలపట్టుకుని వారు.. తీరుబడిగా వీరు!

- కాకినాడ గాంధీనగర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియం వద్ద జి.శివకుమార్ గత ఏడాది డిసెంబర్ 18 తేదీన ఉదయం 6 గంటల సమయంలో స్పెండర్ ప్లస్ బండి పెట్టి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పటికి బండి కనబడలేదు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని బాధితుడు ఆవేదన.
- కాకినాడ రామారావుపేట, వేలమూరివారి వీధిలో న్యాయవాది ఇంటి ముందు ఉన్న హోండా యాక్టివా ఈ ఏడాది జూలై 3న చోరీకి గురైంది. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదంటూ ఆయన గగ్గోలు..
- కాకినాడ కొండయ్యపాలెంలో నివసిస్తున్న కొండపు గౌరి ఒంటిమామిడి జంక్షన్ హోటల్లో పని చేస్తాడు. అతడి ఇంటి ముందు ఉన్న పల్సర్ ఈ నెల 3న ఎవరో పట్టుకుపోయారు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ దాని అతీగతీ లేదు.
- కాకినాడ బాలత్రిపుర సుందరి ఆలయం సమీపంలో ఈ నెల ఒకటిన శ్రీదేవి అనే మహిళ తన బండిని పెట్టి వెళ్లారు. ఆమె తిరిగి వచ్చేటప్పటికి బండి లేదు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే బండి దొంగిలిస్తున్నట్టు నమోదైన సీసీ ఫుటేజీని పోలీసులకు అందజేశారు. ఆధారాలిచ్చినా దర్యాప్తులో జాప్యమేంటన్నది ఆమె ప్రశ్న..



బండి చోరీ చేసేందుకు ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నట్టుగా.. స్టార్ట్ చేసే ప్రయత్నం.. బండితో ఉడాయిస్తూ..
కాకినాడ బాలత్రిపుర సుందరి ఆలయం సమీపంలో సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలివి..

- పోయేది వందల్లో.. కేసులు పదుల్లో!
- వాహన చోరీలపై పోలీసుల కుయుక్తులు
- ఆందోళన చెందుతున్న వాహన చోదకులు

కాకినాడ లీగల్: ఇవన్నీ కొన్ని వాహన చోరీలకు సంబంధించిన ఘటనలు. కాకినాడ నగరంలో గాంధీ నగర్ పార్క్, వివేకానంద పార్క్, ఆలయాలు, కార్యాలయాలు వద్ద బండి పెట్టి లోపలకు వెళ్లొచ్చే సరికి అది అక్కడ ఉంటుందని చెప్పలేని పరిస్థితి. అలాగే రాత్రిపూట ఇళ్ల ముందు పెట్టిన బళ్లు ఉంటాయో.. పోతాయో తెలియని సంశయం. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, పోర్ట్, ఇంద్రపాలెం, సర్పవరం పోలీసు స్టేషన్ల పరిధిలో గత ఏడాదిలో వందల సంఖ్యలో వాహనాలు అపహరణకు గురైనా కేసుల నమోదు అంతంత మాత్రమేనని బాధితుల వాదన.

జాప్యం ఎందుకో..

నేర సమీక్షల్లో తక్కువ కేసులు చూపెట్టడానికే బండి పోయిందని చెప్పినా కేసులు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజుల పాటు నాన్చిన తర్వాతే ఫిర్యాదును పరిశీలిస్తారు. ఈ లోగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకోరు. ఏదైనా కేసు నమోదైతే వెంటనే పరిష్కరించాలి. ఆ వివరాలను నేర సమీక్షల్లో వెల్లడించాలి. కేసు నమోదు చేయకపోతే ఆ సమస్యే లేదన్నట్టు పోలీసులు వ్యవహరిస్తున్నారని బాధితులు అంటున్నారు.

బండి పట్టుకున్నాకే కేసు

టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసులకు ఎక్కువగా బందోబస్తు విధులు ఉంటాయి. దీంతో పోలీసులు తక్కువగా ఉంటారు. ఇదే అవకాశంగా ఎవరైన ఫిర్యాదులు చేయడానికి వస్తే అక్కడి సిబ్బంది కేసులు నమోదు చేయడం లేదు. అయితే దొంగ దొరికినపుడు మాత్రం అదంతా తమ ఘనతేనని చెప్పుకోవడానికి ఆదరాబాదరాగా కేసు నమోదు చేసేసి నిందితుడిని పట్టేసుకున్నట్టు కేసు మూసేస్తారు. కాకినాడలో పలు స్టేషన్లో వందలాది బాధితులు ఉండగా బండి దొరకగానే ఫిర్యాదులు నమోదు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని బాధితులు కోరుతున్నారు.

ఎవరిది బాధ్యత?

వాహనం చోరీపై కేసు నమోదు చేయకుంటే ఆ వాహనాన్ని తీసుకువెళ్లిన వ్యక్తి ఏదైనా యాక్సిడెంట్ చేసినా, ప్రమాదానికి గురైనా బాధ్యత ఎవరు తీసుకుంటారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య రాకుండా ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేయాలని బాధితులు సూచిస్తున్నారు.

ఆధారం లేకపోతే ఇబ్బందే



బండి చోరీ జరిగినప్పుడు బండి యజమాని వద్ద ఎటువంటి ఆధారం లేకపోతే ఇబ్బంది పడతారు. చోరీ జరిగిన బండితో వేరే ప్రాంతంలో ఏమైనా యాక్సిడెంట్ జరిగినా, ఆ బండిపై మాదకద్రవ్యాలు ఉన్నా ముందుగా బండి యజమానినే పోలీసు విచారిస్తారు. అయితే బండి యజమాని వద్ద ఎటువంటి ఆధారం లేకపోవడం వల్ల వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. బండి చోరీ జరిగిన వెంటనే పోలీసులు వద్ద నుంచి ఏదో ఆధారం తీసుకోవాలి. లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తెసుకువెళ్లాలి.

వి.రాజు, న్యాయవాది,
కాకినాడ బార్ అసోసియేషన్

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

- జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్
- ఉత్సాహంగా హాక్‌థాన్–25



హాక్‌థాన్‌లో పాల్గొన్న వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఇంక్యుబేషన్ డైరక్టర్ గోపాలకృష్ణ

బాలాజీచెరువు: సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఏటీపీహబ్, డైరక్టర్ ఆఫ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో హాక్‌థాన్–25 నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్, ఒక కుటుంబం–ఒక వ్యాపారవేత్త వంటి కార్యక్రమాల గురించి వివరించారు. విద్యార్థుల ఆవిష్కరణలు దేశ జీడీపీ పెరుగుదలకు, భారత ఉత్పత్తిరంగం అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. భవిష్యత్‌లో జేఎన్‌టీయూకే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రతిభావంతులైన ఆవిష్కరణలకు నిధులు అందించడాన్ని సులభతరం చేస్తుందన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక ఆవిష్కరణలకు సహకరించడంలో ఇంక్యుబేషన్ సెంటర్ పాత్ర తెలియజేశారు. హాక్‌థాన్‌లో 180 మంది విద్యార్థులు పాల్గొని 20 ప్రతిపాదనలు తయారుచేయగా టాప్–3 అంశాలను ఎంపికచేశారు. ఆధునిక ఫ్లైట్ కంట్రోలర్ (అజయ్, శామ్సన్, ప్రీతమ్‌ల బృందం. స్కూల్ ఆఫ్ ఎవాయినిక్స్), ఆటోనమస్ షిప్‌హోల్‌బార్నికల్ తొలగింపు (శ్రవణ్, లక్ష్మి, సాత్విక, విష్ణుల బృందం. ఈసీఈ విద్యార్థులు), ఏఐ ఆధారిత పీడీఎఫ్ ఎడిటర్ (లలిత, తరుణ్, రేవంత్, లక్ష్మి బృందం, సీఎస్ఈ విద్యార్థులు)లు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనరావు, ఈసీఈ విభాగాధిపతి లీలాకుమారి పాల్గొన్నారు.